

## వెలుగుతున్న సముద్రం

ప్రాచీన కాలం నుండీ సముద్ర ప్రయాణం చేసిన నావికులు చాలా మంది తమకు రాత్రి సమయంలో ఓడ చుట్టూ కనుచూపు మేరా సముద్రం వెలుగుతూ కనపడిందని చెప్పిన ఉదంతాలు చాలా ఉన్నాయి. అయితే ఇప్పటి వరకూ శాస్త్రీయమైన ఋజువులేవీ లభ్యం కాకపోవడం వల్ల అవన్నీ కట్టు కథలుగానే అందరూ కొట్టి పడేశారు. చివరకు అలనాటి సైన్స్ ఫిక్షన్ రచయిత జుల్స్ వెర్న్ కూడా తన నవల '20,000 లీగ్స్ అండర్ సీ'లో ఇలాంటి దృశ్యాన్ని వర్ణించాడు. అయితే ఇప్పుడు కృత్రిమ ఉపగ్రహాల పుణ్యమాని కొన్ని చోట్ల సముద్రం వెలుగుతుందనడానికి ఆధారం లభించింది. ఇటీవల శాటిలైట్ తీసిన కొన్ని చిత్రాల్లో హిందూ మహా సముద్రంలో ఆఫ్రికా ఖండం దరిదాపుల్లో సముద్రం కాంతి మయంగా వెలుగుతూ కనిపించింది. ఇది వరుసగా మూడు రాత్రులు వెలుగుతూ కనిపించింది. ఈ వెలుగు ప్రదేశం సుమారు 250 కిలో మీటర్ల పొడవుంది. అటు వైపుగా పోతున్న ఓ ఓడ ప్రయాణికులు కూడా ఈ వెలుగును చూశామని చెప్ప టంతో ఇప్పుడు శాస్త్రవేత్తలు




దీనికి కారణాలు వెతికే పనిలోపడ్డారు. కొందరు శాస్త్రవేత్తలు ఈ వెలుగుకి కారణం సముద్రంలో ఉన్న ఒక రకమైన బాక్టీరియా అని చెప్తున్నారు. ఈ బాక్టీరియాకు స్వతస్సిద్ధంగా వెలిగే లక్షణం ఉండి వుండవచ్చని వారు ఊహిస్తున్నారు. అయితే ఇవన్నీ ఊహాగానాలే. ఇది నిజంగా బాక్టీరియా అయితే, ఏకంగా 250 కిలోమీటర్ల మేరా వెలుగు తెప్పించేంత బాక్టీరియా గుంపు ఒకే చోట ఎందుకు చేరిందీ అన్న ప్రశ్నకు ఎవ్వరూ సరైన సమాధానం చెప్పలేక పోతున్నారు.

*

# 'సరసి'కత

వైశంపాయనుడు చాలా కాలం పెళ్ళి చేసుకోలేదు. బ్రహ్మచారిగా వుంటే సర్వశక్తి సమన్వితుడిగా వుండవచ్చునని, పెళ్ళయితే ఆ శక్తులన్నీ పోతాయనీ ఎవరో సాధువు చెప్పాడట.

ఓ రోజు తెల్లవారు ఝామున అతగాడు పని మీద బయటకు వెడుతూ, చీకట్లో ఓ కుక్క తోక తొక్కాడు. అది పిక్క పట్టుకొని పీకింది. కుక్క కరిస్తే బొడ్డు చుట్టూ ఇంజెక్షన్లు చేయించుకోవాలనీ, లేకపోతే పిచ్చెక్కి నురగలు కక్కుకొని చచ్చిపోతారని చిన్నప్పటి నుంచీ విని వుండడం చేత వెంటనే డాక్టరు దగ్గరకి వెళ్ళాడు.

"తోకని తొక్కినందు వల్ల కరిచింది. అది పిచ్చి కుక్క అయి వుండదు. అయినా ఎందుకైనా మంచిది, ఓ వారం రోజులు దాన్ని అబ్జర్వ్ చేయండి" అన్నాడు డాక్టరు ఇంజెక్షన్ చేస్తూ.

"వారం రోజులు అబ్జర్వ్ చేయాలంటే ఆఫీసుకు సెలవు పెట్టాలి" అనే మీమాంస

## ఇదో కుక్క




కలిగిందతడికి. ప్రాణం కంటే ఆఫీసు గొప్పది కాదనుకొని, క్యాజువల్ లీవు పడేసి, సంచిలో టిఫిన్ బాక్స్ పెట్టుకొని ఆ కుక్కని వెదుకుతూ బయల్దేరాడు వైశంపాయనుడు. అది ఆ కాలనీలో తిరిగే కుక్కే కావడం చేత ఎక్కువ ప్రయాస పడకుండానే దర్శనం ఇచ్చింది.

ఆ కుక్క ఆడది కావడం చేతనూ, అది 'ప్రేమికుల కార్తె' కావడం చేతనూ ఆమెను ప్రేమిస్తున్న నాలుగు కుక్కలు ఆమె వెంటే రాసుకు పూసుకు తిరుగుతున్నాయి. ఆమె ఆగితే ఆగి, నడిస్తే నడిచి, కూర్చుంటే కూర్చుని ఒక్క క్షణం కూడా ప్రేయసిని విడిచిపెట్టకుండా తిరుగుతున్నాయవి. అదే సమయంలో తనను కరచిన కుక్క యొక్క స్థితిగతుల్ని పరిశీలించే ప్రాజెక్టు మీదున్న వైశంపాయనుడు కూడా కాస్త ఎడంగా ఆమెను ఫాలో కాసాగేడు.

నాలుగు రోజుల నుంచి ఎప్పుడు చూసినా ఆ కుక్కతోటే కనిపిస్తున్న వైశంపాయనుడిని దగ్గరకు పిలిచి ఓ పెద్దాయన ఇలా అన్నాడు.

"బాబూ ఏమనుకోకు. ఇప్పటికే దాని వెంట నాలుగు కుక్కలు తిరుగుతున్నాయి. ఇంకా నువ్వు కూడా ఎందుకూ? చక్కగా ఓ మంచి సంబంధం చూసి పెళ్లి చేసుకో!" అని.

*